86

# తలకుండు విషము ఫణికిని...

"దేనికన్నా అంతం ఉంటుందేమోగానీ, నా పాడుబతుక్కి మాత్రం అంతం కనిపించడంలేదు బాబయ్యా. ఏ నిమిషాన ఈ భూమిమీద పడ్డానో నాకు తెలియదు. అప్పణ్ణించీ నాకు సుఖమంటే ఏమిటో తెలియదంటే మీరు నమ్మరు." అన్నాడు ఖాజామియా - పామును బుట్టలోకి సర్దుకుంటూ.

ఏ సంవత్సరం, ఏ నెల, ఏ తేదీన, ఎన్ని గంటలు, ఎన్ని నిమిషాలు, ఎన్ని సెకండ్లకు ఖాజామియా పుట్టాడో మనకు తెలియదు. అతనికీ తెలియదు. కానీ ఎండాకాలంలో సాయంకాలం పూట, జంగిలి గొడ్లు ఇళ్ళ కొచ్చేవేళప్పుడు పుట్టానని మాత్రం ఖాజా చెబుతాడు. అదిగూడా, వాళ్ళమ్మ తన చిన్నప్పుడు ఎవరితోనో చెబితే ఆ ఎవరో తను పెద్దయ్యాక తనతో చెబితే అది గుర్తుంచుకొని చెప్పాడు ఖాజామియా.

ఖాజామియా మాతామహుడు, కటిక దరిద్రుడు. ఓ చిన్న నుదురు పాక ఉండేదాయనకు, పైన రెల్లుగడ్డి కప్పాడు. దాని అడుగున చింత కొమ్మలు పరిచాడు. ఆ కొమ్మలకూ వాసాలకూ కలిపి చింతబరికెలతో ముళ్ళు చేశాడు. ఆయన చాలా కాలం జీవించాడు. అయితే ఖాజామియాకు కాస్తంత ఊహ తెలిసేదాకా, తన తల్లి తనకు బొత్తిగా గుర్తులేదన్నాడు ఖాజామియా.

"మా నాయనమ్మ చాలా గద్దరి ముండని చెబుతారు. మా నాన్న అన్నదమ్ములు నలుగురు. మా నాన్న పెద్దవాడు. మెత్తని వాడు. అమాయకుడు. మా నాయనమ్మ అస్తమానమూ తన కోడల్ని రాచి రంపాన పెడుతుండేది. తిన్నగా తిండి పెట్టేది కాదు. తిట్టేది, కొట్టేది. నేను మూడేళ్ళ వాణ్ణయి వుండగా ఆ బాధలు భరించలేక మఠం దగ్గర బావిలో దూకి చచ్చిపోయింది. బావిలో దూకినప్పుడు పైకి తేలతానేమో నన్న అనుమానంతో వొడినిండా రాళ్ళు నింపుకొని మరీ దూకింది. రెండవ రోజున గానీ, ఆ సంగతి తెలియలేదు" అన్నాడు ఖాజామియా తల్లిని తలచుకొని బావురుమని ఏడుస్తూ!

ఏడాది తిరక్కముందే నసీరుద్దీన్ మళ్ళీ పెళ్లి చేసుకున్నాడు. ఖాజామియా తన మాతామహుని ఇంటికొచ్చేశాడు. అక్కడ ఏడెనిమిది సంవత్సరాలు వచ్చేదాక వున్నాడు. అంతలోనే అమ్మమ్మ చచ్చిపోయింది. మేనమామలు, వేరుపడిపోయారు. తండ్రిని ఎవరు పోషించాలన్న తగాదాలతోనే వారు తలలు బద్దలు కొట్టుకు చస్తుంటే, తనను పట్టించుకొనేవారెవరు గనక!

అందుకే ఖాజామియా తిరిగి తండ్రి దగ్గరికి వచ్చాడు. "మా నాన్న మంచివాడే! కానీ, మా పిన్ని మాటలకు ఎదురు చెప్పలేడు. మా పిన్నికి అప్పటికే నలుగురు పిల్లలు. వాళ్ళందరూ నన్ను పనిమనిషిగా చూసేవారు. వాళ్ళకు అడ్డమైన పనులు చేసేవాణ్ణి. చేయడానికి ఓపిక లేక మానుకుంటే, చావబాదేవారు" అన్నాడు ఖాజామియా. నసీరుద్దీన్‌కు పదకొండెకరాల బాడవ పొలం వుండేది. కాడెడ్ల వ్యవసాయం. రెండు పాడిబర్రెలు. ఖాజామియా తమ్ముళ్ళు దర్జాగా తిరుగుతుంటే, కాజామియా గొడ్లపని, పొలంపని చేసేవాడు.

"అదే నాకు కాస్త అన్నం పెట్టింది బాబయ్యా!" అన్నాడు ఖాజామియా.

జరిగిన మోసమంతా ఆస్తి పంపకాల దగ్గర జరిగింది. ఖాజామియా పోషణ కోసం వెయ్యి

రూపాయలు- ఆ రోజుల్లో వెయ్యి రూపాయలు నసీరుద్దీన్ తన మామ గారికిచ్చాడు. అంటే అప్పుడే ఆస్తి పంపకాలు జరిగాపోయాయని అర్థం. ఆ ముసలి పీనుగు ఆ వేయి రూపాయల్ని దిగమింగి ఖాజామియాను మళ్ళా పుట్టింటికి తరిమేశాడు. కన్న తండ్రి గనుక కొడుకును వొదులుకోలేక దగ్గర అట్టే పెట్టుకున్నాడు. ఇంట్లో ఉంటున్నాడు గనుక ఇంత చాకిరీ చేస్తున్నాడు. పొట్టపగిలేలా తింటున్నాడు అంత మాత్రాన, ఆస్తిలో మళ్ళా భాగమంటే ఎలాకుదురుతుందీ!

ఇరవయ్యేళ్ళపాటు, అప్పెశంగా పెదరామయ్యగారింట్లోనే ఉన్నాడు. ఆయన పొలమే తన పొలం, ఆయన గొడ్లే తన గొడ్లు. ఆయన క్షేమమే తన క్షేమం, ఆ పెదరామయ్యగారే తన సర్వస్వం. ఆయనే అన్నదాత. ఆయనే అల్లా.

ఖాజమియా వెళ్ళాక, పెదరామయ్యగారికి బాగా కలిసొచ్చింది. ఈలోగా ఖాజామియాక్కూడా పెళ్ళయింది. పెదరామయ్యకు సంతానం కలిగింది. కాజమియాకు ఆ అదృష్టంలేదు. ఆయన పిల్లల్నే తన పిల్లలుగా సాకాడు.

ఒకసారి కంద దుంపలు బండి నిండా వేసుకొని చీకటి పాటున వొస్తున్నాడు ఖాజామియా. బండి పూటిగుంటలో పడి ఆకులు విరిగి, బండి రోజీ పక్కకు కూలిపోయింది. దుంపలన్నీ డొంకనిండా పడ్డాయి. కుడికాలు విరిగింది. ఎదుర్రొమ్ము పక్క కటి ఎముకలు విరిగాయి.

ఖాజామియా కోలుకోడానికి నాలుగు నెల్లుపట్టింది. గాజుల సోమయ్య కుప్పెలు, మాత్రలు నూరి పోసాడు.

'మాడుజీవు' పట్టుకూడా వేశాడు. ఆఖరుకు 'సంధి' పుట్టింది. ఇక దానికి మందులేదు. 'గరళం' పోయాలి. ఆ దెబ్బతో రోగం తిరిగితే తిరగాలి, లేదా చావన్నా రావాలి. అయితే అప్పటికప్పుడు విషం కావాలంటే ఎక్కడ దొరుకుతుంది!

ఆ రోజు సాయంత్రమే 'కోటప్పడు' పాముల్నాడించుకొంటూ ఆ వూరొచ్చాడు. పెద్దరామయ్యగారు కోటప్పణ్ణి బతిమిలాడి నీరుకాని ఉత్తరీయం వాడికిచ్చి, పది చుక్కల విషం పట్టుకొచ్చాడు. ఆ విషంలో కూప్పె మందు నూరి, ఖాజామియాకిచ్చాడు గాజుల సోమయ్య. ఆ విషంలో ఏమాయ ఉందో ఏమోగానీ ఖాజామియా రోగం తిరుగుముఖం పట్టింది. పోతాడనుకొన్న మనిషి బతికి బయట పడ్డాడు.

"పెదరామయ్యగారి మనసులో ఏమున్నా బాబుగారూ, ఆయన బామ్మరిది మాటకే ఆ ఇంట్లో చెల్లుబడి. ఆయనదే పెత్తనమంతా. ఆయన వొత్తిడిని కాదనలేక పెదరామయ్యగారు నన్ను పనినుంచి మానిపించారు." అన్నాడు ఖాజామియా.

అప్పటికే ఎండ మిటమిటాడుతోంది. ఉండి ఉండి బుట్టలోంచి పాము, 'ఉస్సు' అంటూ బుసలు కొడుతోంది. లోపలికి పీక్కుపోయిన బుగ్గల్ని మరోసారి చప్పుడయ్యేలా, లొట్టలేశాడు ఖాజామియా.

"ఆ తర్వాత ఆ పనీ ఈ పనీ కొంతకాలం చేశా. బతికున్నప్పుడు చంపే మనుషుల కన్నా చావబోయే వాణ్ని బతికించిన పాములే నయమనిపించిందండీ, అప్పుడు నేర్చొకొన్నా ఈ పాముల్నాడించడం".

ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం ఇష్టం లేదేమో మరి ఖాజామియా సమాధానాలు చెప్పకుండా దాటేశాడు.

"ఒకప్పుడు ఈ పాముల్నాడించడం, ఎప్పుడన్నా చేస్తుండేవాణ్ని, ఇప్పుడిదే నాకింత బువ్వ పెడుతున్నది. నాకొక ఊరేంటి బాబుగారూ ఈ అన్నివూళ్లూ నావే! రోజుకు రెండు మూడు చోట్ల మోళీలు వేస్తా. ఒక్కోసారి 7, 8 రూపాయల దాకా దొరుకుతాయి. వానాకాలంలో ఆటసాగదండీ. ఈ పాము పేరు 'సికిందర్' చాలా మంచి ముండ. చెప్పినట్లు వింటుంది. మేత వేసిందాకా మెదలకుండా వుంటుందేగానీ, మారాం చేయదు" అన్నాడు ఖాజామియా.

ఇంతకు ముందొక నల్లతాచు ఉండేదనీ, దానికి వల్లమాలిన కోపమనీ, అది బుస్సు, బుస్సంటూ జనం మీదకి ఎగిరెగిరి దూకుతుండేదనీ, దాని భయం వల్ల జనం తన ఆటకు వచ్చేవారు కాదనీ, అందుకనే దాన్ని అమ్మేశానని చెప్పాడు ఖాజామియా.

తాను చాలా రకాల పాముల్ని ఆడించానన్నాడు. వాటిని పట్టుకొనే పద్ధతీ, వాటిని ఆటకు అలవడే పద్ధతీ అతను దాటవేస్తూ చెప్పాడు.

"ఇప్పుడు మేమిద్దరమే ఉన్నాం. మాకెవ్వరూ లేరు. నా ముందు అది దాటిపోతే అదృష్టవంతురాలేననుకోండి. నేనే ముందయితే మాత్రం, దాని బతుకు బుగ్గిపాలయిపోతుందని బాధపడుతున్నా. నన్ను చేసుకొని అది సుఖపడిందేమీ లేదండీ" అన్నాడు ఖాజామియా. 'సికిందర్' ఇంకోసారి బుస్సుమంటూ బుట్టమూతను తొలగదీసుకొని, ఖాజామియా వైపు పడగ చాపింది. నాలుకలు కోరుతూ, మెల్లగా బయటకొచ్చి ఖాజామియా ఒళ్ళో చుట్టవేసుకు పడుకొంది.

"ఆకలయింది బాబు పిచ్చి ముండకు, లేకపోతే అలా బయటకు రాదు"అని ఆప్యాయంగా ఆ పామును నిమరసాగాడు ఖాజామియా.